ఆందోళన వీడితే విజయం మీదే..

జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు చదువుదే కీలకపాత్ర. ఇందులో కీలకమైన పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలు సమీపించాయి. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్, మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ దశలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితేనే విజయం సొంతమవుతుంది. అంతేకాకుండా పది, ఇంటర్ దశలో సాధించిన మార్కులే విద్యార్థి భవిష్యత్‌కు సోపానాలు. అందుకే విద్యార్థులతోపాటు అటు తల్లిదండ్రుల దృష్టి ప్రస్తుత వార్షిక పరీక్షలపై పడింది. పోటీ ప్రపంచంలో పక్కా ప్రణాళికే విద్యార్థికి ఆయుధంగా మారాలి. తల్లిదండ్రులు, గురువులు విద్యార్థులకు సరైన సూచనలివ్వాలి. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఆందోళనను దూరం చేయాలి.


పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

- సమీపిస్తున్న టెన్త్, ఇంటర్ పరీక్షలు
- కీలక తరుణం.. సాధించాలి విజయం
- ప్రణాళికే విద్యార్థికి ఆయుధం

ఇల్లెందురూరల్: విద్యార్థులు అనుకున్న ఫలితాలు సాధించాలంటే కష్టంగా ఉన్న సబ్జెక్టులకు ప్రాధాన్యమివ్వాలి. తొలుత వారానికి సరిపడా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. చదవగలిగే విధానాన్ని చూసి పాఠాల్ని విభజించుకొని టైం టేబుల్ తయారు చేసుకోవాలి. ఇప్పటి నుంచే పరీక్షలు రాస్తున్నామనే భావన పెంపొందించుకోవాలి. చదివేటప్పుడు ముందుగా కష్టంగా అనిపించే వాటిని, తరువాత తేలిక అనిపించే సబ్జెక్టులను చదవడం మంచిది. నిరంతరం మనం చేరాలనుకున్న లక్ష్యాన్ని గుర్తుచేసుకుంటూ చదివితే మంచి ఫలితాలు వస్తాయి. నూతనోత్సాహం పెరుగుతుంది.

నిద్ర ముఖ్యమే..

సూర్యోదయం కన్నా ముందు నిద్ర లేవగలిగితే జీవితంలో సగం విజయం సాధించినట్లే. చాలామంది విద్యార్థుల్లో రాత్రి చదవాలో.. ఉదయం చదవాలో అనే సదేహం ఎక్కువగా ఉంటుంది. అర్ధరాత్రి వరకు నిద్రమానుకొని చదవడం వల్ల ప్రయోజనం తక్కువే. మన శరీరం ఉదయం నుంచి సాయంత్రం వరకు అలసిపోతుంది. రాత్రి పది తరువాత సంగ్రహణ శక్తి అంతగా ఉండదు. అందుకే తెల్లవారుజామున చదవడం అన్ని విధాలా మంచిది. కచ్చితంగా 6 నుంచి 7 గంటలు ప్రశాంతంగా నిద్రపోతేనే మెదడుకు సంపూర్ణ విశ్రాంతి లభిస్తుంది. ఇంట్లో తల్లిదండ్రులు, తరగతి గదిలో గురువులు విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంచే మాటలతో వారిని సిద్ధం చేయాలి. బృందంగా చదివించేందుకు గురువులు శ్రద్ధ తీసుకోవాలి. ఈ రెండు, మూడు నెలలు ఇంట్లో వారికి ప్రశాంత వాతావరణం అందించాలి.

వీటిని విస్మరించొద్దు..

కళ్లకు వీలైనంత విశ్రాంతినివ్వాలి. చదువు మధ్యలో కళ్లు మూసుకొని పునశ్చరణ చేసుకోవాలి. చేతిరాత పైనే మార్కులు ఆధారపడి ఉంటాయని గుర్తించండి. మీరెంత బాగా చదివినా రాత ఆధారంగానే మార్కులుంటాయి. రోజులో పావుగంట అయినా అక్షరాల సాధనకు కృషి చేయాలి. అక్షరాలు మరీ దగ్గరగా, మరీ దూరంగా ఉండకుండా నిరనిర్దిష్ట క్రమంలో రాయాలి. పేరాగ్రాఫ్‌లుగా రాయడంతోపాటు శీర్షికలు, ఉపశీర్షికలతో మంచి మార్కుల్ని పొందవచ్చు. అప్పుడప్పుడు శ్వాసమీద దృష్టి పెట్టాలి. ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తూ దీర్ఘంగా శ్వాస తీసుకొని వదులుతుండాలి. ఇలా పదిహేను నిమిషాలపాటు చేయడంతో ఫలితముంటుంది. కనీసం 45 నిమిషాలకోమారు స్వల్ప విశ్రాంతి అవసరం. చదువుకునేటప్పుడు సెల్‌ఫోన్‌లో పాటలు వినడం లేదా పక్కన పెట్టుకోవడం చేయకూడదు. అదే సమయంలో అటు టీవీ చూస్తూ ఇటు చదవకూడదు. ఎక్కడైతే చదవాలనుకుంటున్నారో.. అక్కడ స్వచ్ఛమైన గాలి, వెలుతురు ఉండేలా చూడాలి.

ఆహారంలో జాగ్రత్తలు పాటించాలి..



ఆహారం మనసుపై ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యంగా విద్యార్థులకు అందించే ఆహారంలోని జింక్ జ్ఞాపకశక్తి పెరుగుదలకు దోహదం చేస్తుంది. అందుకే సమతుల ఆహారం తీసుకోవాలి. జామకాయ, బొప్పాయి వంటివి తీసుకోవాడం మంచిది. వీటితోపాటు బలవర్ధకమైన ఆహారం తినాలి. ఫాస్ట్‌ఫుడ్ జోలికి వెళ్లొద్దు. ఒక్కసారి అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటే కీలక దశలో ఇబ్బంది తప్పదు. ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.

– డాక్టర్ లోహిత, వైద్యాధికారి, కొమరారం పీహెచ్‌సీ

సానుకూల దృక్పథం పెరగాలి



నేను బాగా చదువుతాను అనే దృక్పథం ఎప్పుడైతే విద్యార్థిలో పెరుగుతుందో దాని వల్ల చదివింది మెదడుకు చేరుతుంది. లేదు నాకన్నా బాగా చదివే వారెందరో ఉన్నారు.. ఇప్పుడు చదివితే ఏం గుర్తుంటుంది.. పరీక్షల ముందు చదువుదాంలే.. అనే నిర్లక్ష్య ధోరణికి స్వస్తి పలకాలి. పరీక్షలంటే భయాన్ని వీడాలి. బాగా చదివాను. బాగా రాస్తాను అనే ధీమాతో ఉండాలి. అనవసరమైన ఒత్తిడితో ఆందోళన చెందవద్దు.

– పిల్లి శ్రీనివాస్, ఎంఈఓ, ఇల్లెందు మండలం

ప్రజా సమస్యలు పరిష్కరించండి..


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని, ఆదివాసీలకు ఇతర (నాన్ ట్రైబల్) వారు ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న పోడు భూమలకు పట్టాలివ్వాలని, ఏజెన్సీ గ్రామాల్లో రోడ్లు, వంతెనలు నిర్మించాలని కోరారు. అదేవిధంగా తుమ్మలగూడెం పరిధిలోని ఇరసాని వాగు ప్రాజెక్ట్ నీటి కాలువలు పొడిగించి బంగారు చెలక వరకు సాగునీరు అందించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గం చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు చెంద్ర అరుణ, ముద్దా బిక్షం, జాటోత్ కృష్ణ, మాచర్ల సత్యం, నిమ్మల రాంబాబు, ఎస్కే యాకూబ్ షావలి, పి.సతీష్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తా..

పాల్వంచ: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో పాల్వంచ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యేను సన్మానించారు. కూనంనేని మాట్లాడుతూ... తాను జర్నలిస్ట్‌గానే కొత్తగూడెంలో ప్రస్థానం ప్రారంభిచానన్నారు. తన ఎదుగుదలకు, పట్టుదలకు పత్రికారంగం ఎంతో ఉపకరించిందని చెప్పారు. ఇప్పటికీ తాను కాలమిస్ట్‌గా వ్యాసాలు ఇస్తుంటానన్నారు. జర్నలిస్టుల సంక్షేమంపై దృష్టి పెడతానని, ఇళ్ల స్థలాలు, పింఛన్, ఇతర అన్ని సౌకర్యాలపై ప్రభుత్వంతో మాట్లాడి అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఎస్కే సాబీర్‌పాషా, నూకల రంగారావు, పాల్వంచ ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు రుద్రారపు సంజీవ్ కుమార్, అధ్యక్షుడు వేముల కొండల్‌రావు, ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ, చంద్ర నర్సింహారావు, రజాక్, వెంకట నారాయణ, అబ్బురాం, పోటు పుల్లారావు, నాగేశ్వరరావు, జైనుల్లాబుద్దీన్, భద్రం, తోట శ్రీనివాసరావు, రామకృష్ణ, సందీప్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: గ్రామాల్లో పండుగల సందర్భంగా నిర్వహించే క్రీడల్లో యువత పాల్గొని రాణించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని ధనియాలపాడు గ్రామంలో యువతకు క్రీడా దుస్తులను గురువారం ఆయన పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. ఇల్లెందు మండలంలో పలు పండుగలను పురస్కరించుకొని మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. క్రీడలకు యువత అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఇటువంటి పోటీలు ఏళ్ల తరబడి విజయవంతంగా కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. చదువుతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇచ్చినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అనంతరం గ్రామంలోని యువతకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధనియాలపాడు, చల్లసముద్రం సర్పంచ్‌లు నూనావత్ తిరుపతి, తాటి చుక్కమ్మ, ఉపసర్పంచ్ పోటు రవి, నాంచారమ్మ, తాటి భిక్షం, సీతక్క, పకీరయ్య, సలీం, వీరగోని కుమార్, కోటయ్య, సట్ల శ్రీనివాస్, జబ్బ అంజయ్య, మాచర్ల కుమార్ తదతరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి పొంగులేటికి ఆహ్వానం


శాంతి కల్యాణానికి మంత్రిని ఆహ్వానిస్తున్న వేదపండితులు

కొత్తగూడెంటౌన్: ఫిబ్రవరి 24న ఇల్లెందు క్రాస్ రోడ్డు సమీపంలోని కార్తీకవనం నర్సరీలో విశ్వ శాంతి కళ్యాణ మహోత్సవం జరగనుంది. ఈ మేరకు పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార ప్రచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి శ్రీచండీ సర్వజ్ఞపీఠం వ్యవస్థాపకులు, వేదపండితులు దండిబోట్ల రామాంజన కుమార శర్మ గురువారం స్వయంగా ఆహ్వాన పత్రం అందజేశారు.

నిధులు సద్వినియోగం చేసుకున్నాం..

ఇల్లెందురూరల్: నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలో గడిచిన ఐదేళ్లలో పలు అభివృద్ధి పనులు చేశామని కొమ్ముగూడెం సర్పంచ్ సూర్నపాక రామయ్య అన్నారు. కొమ్ముగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం చివరి సర్వసభ్య సమావేశం గురువారం సర్పంచ్ రామయ్య అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకున్నామని చెప్పారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా పాలకవర్గం సమష్టిగా కృషి చేసిందని వివరించారు. ఉపసర్పంచ్ తాటి రాంబాబు, ఎంపీటీసీ తాటి యశోద, వార్డు సభ్యులు, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ ఎన్నిక


అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, నాగేశ్వరరావు

జూలూరుపాడు: స్థానిక ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మున్నూరు కాపు సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాపకొల్లుకు చెందిన రామిశెట్టి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా మాచినేనిపేటకు చెందిన మల్లెల నాగేశ్వరరావు, కోశాధికారిగా వెంగన్నపాలెంకు చెందిన రామిశెట్టి నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా గోపు రామకృష్ణ, తాటికొండ వెంకట రాంప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఉసికల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా ముత్తినేని రామయ్య, గౌరవ సలహాదారులుగా బాపట్ల మురళి, రోకటి సురేష్‌లు నియమితులయ్యారు.

ఉద్యమకారులకు పింఛన్ ఇవ్వాలి

జూలూరుపాడు: తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్, ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఉద్యమకారులు గురువారం తహసీల్దార్ శారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో చిలుకూరి రమేష్, వై.గోపాల్‌రావు, బానోత్ ధర్మా, దాసరి నాగయ్య, వల్లోజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కొత్తగూడెంటౌన్: ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుంని అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు అన్నారు. గురువారం ఆయనను రాష్ట్ర చైనీస్ కుంగ్‌ఫూ కరాటే అసోసియేషన్ ప్రతినిధి ఐ.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి కాశీ హుస్సేన్, కాశిమల్ల పద్మ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు కాశిమల్ల పద్మను అభినందించారు.

ఆర్థిక సాయం

పాల్వంచ: పేద విద్యార్థి ఇంజనీరింగ్ విద్యాభ్యాసం నిమిత్తం సీపీఐ పట్టణ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ అడుసుమల్లి సాయిబాబు గురువారం ఆర్థిక సాయం అందించారు. స్థానిక రాంనగర్‌కు చెందిన డి.తిరుమలరావు ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పేద విద్యార్థి కావడంతో అతనికి సాయిబాబు తన మనుమరాలు కారుణ్య శ్రీ చేతుల మీదుగా రూ.10వేల నగదును తిరుమలరావు తల్లి వెంకటలక్ష్మికి అందించారు. ఇంజనీరింగ్ విద్య పూర్తయ్యే వరకు ఆర్థిక సాయం అందిస్తానన్నారు.

అవినీతిపై చర్యలు తీసుకోండి..

కొత్తగూడెంటౌన్: మాజీ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యశాఖ అధికారిపై చర్య తీసుకోవాలని కోరుతూ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్, ఆ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌లకు గురువారం హైదరాబాద్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ గుగులోతు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రాలు అందజేశారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీకి ఆదాయ మార్గం ఉన్నా.. ప్రయోజనం సున్నా.. అన్నట్లు తయారైందని, సుమారు 200 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌లు అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా పాలకవర్గం విఫమయిందని ప్రజాపంథా అనుబంధ ఇఫ్టూ కార్మిక సంఘం ఆరోపించింది. గురువారం ఇల్లెందులోని కూరగాయల మార్కెట్‌లో నిర్మించిన 182 గదులు, లలిత కళామందిర్ రోడ్‌లో నిర్మించిన 32 గదులు షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు యాకుబ్‌షావలీ మాట్లాడుతూ... మెయిన్ రోడ్ హైస్కూల్ వద్ద 24 గదులు, పోస్టాఫీస్ వద్ద 12 గదులు ఉన్నాయని తెలిపారు. ఈ గదులను టెండర్/వేలంపాట ద్వారా అద్దెకు ఇస్తూ ప్రతీ నెల రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుందన్నారు. పట్టణంలో మున్సిపల్ భవనాలు అసంపూర్తిగా కొన్ని, ఖాళీగా కొన్ని ఉన్నాయని వాటిని గుర్తించి ఉపయోగంలోకి తెస్తే ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్షణం ఎమ్మెల్యే జోక్యం చేసుకుని మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వీరన్న, కృష్ణ, సుధాకర్, వెంకన్న, యాదమ్మ, జానీ, భూలక్ష్మి, శంకర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ఆహ్వానం

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో ఉద్యోగుల గృహాలకు గ్యాస్ డోర్ డెలివరీ కోసం టెండర్ ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇల్లెందు సూపర్ బజార్ నుంచి ఉద్యోగుల నివాసాలకు రెండు సంవత్సరాల పాటు వంట గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి రూ.97 టెండర్ ప్రాసెసింగ్ రుసుముతో జీఎం కార్యాలయంలో దరఖాస్తు పొందవచ్చన్నారు.

వేలంపాట

కొత్తగూడెంటౌన్: శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)కు చెందిన రెండు షాపులను శుక్రవారం వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ కె.సులోచన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు డిపాజిట్ చెల్లించాలని, వివరాలకు 9908008860, 9550429475, 8790512034 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఇల్లెందురూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

హైపవర్ వేతనాలివ్వాలని ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం జక్కం రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు 20శాతం బోనస్ చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మిక కుటుంబ సభ్యులకు సింగరేణి ఆస్పత్రుల్లో మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా ప్రతీనెల ఏడో తేదీ లోపు వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్, కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు దొడ్డి నిర్మల, మొగిలిపాక రవి, టీవీ సూరి, నర్మద, అశ్విని, మాధురి, గాయత్రి, రమణ, మానస, జయ, నాగ స్వరూప, విజయలక్ష్మి, రమాదేవి, అనూష, సంతోషి, వెంకటేశ్, సత్యనారాయణ, సాయి రాము, రవీందర్ పాల్గొన్నారు.

సెక్రటేరియట్ ముట్టడికి తరలిరండి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

జూలూరుపాడు: భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఆధ్వర్యంలో 30న జరగనున్న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవి చందర్ చౌహాన్ పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడు ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో గోర్ బంజారా పోరాట సమితి ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రవి చందర్ చౌహాన్ మాట్లాడుతూ... శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవుదినంగా ప్రకటించాలని, సాదాబైనామా భూముల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. అదేవిధంగా గిరిజనులకు ఇందిరమ్మ గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని తదితర డిమాండ్ల సాధనకై సచివాలయ ముట్టడి చేపడుతున్నట్లు చెప్పారు. గిరిజన లంబాడీ తండాల్లో ధూప, దీప, నైవేద్యం పథకం కింద స్వామిజీలకు ప్రతీనెల రూ.10 వేలు వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం సెక్రటేరియట్ ముట్టడి ప్లకార్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలోత్ రాందాస్ నాయక్, బానోత్ దుర్గాప్రసాద్, బోడా రవి, బానోత్ రాంబాబు, లకావత్ గణేష్, గుగులోత్ భావ్‌సింగ్, బానోత్ దేవీలాల్, గుగులోత్ వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గౌడలను ఎస్టీలుగా గుర్తించాలి


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఏజన్సీలో అనాదిగా నివసిస్తున్న గౌడలను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ ఏజెన్సీ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం గురువారం కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... షెడ్యూల్డ్ ట్రైబల్స్‌గా రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాల ప్రకారం తక్షణమే ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబల్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ పునర్విభజన చట్టంలో ఏజెన్సీ గౌడ ఎస్టీ అని పేర్కొన్నారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాలలో రేవంత్‌రెడ్డి ఏజెన్సీ గౌడలు ఎస్టీలు అని షెడ్యూల్డ్ ట్రైబల్ సర్టిఫికేట్ ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి స్పందించి ఎస్టీ సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నరాటి ప్రసాద్, కాసుల శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్వర్లు, భరధ్వాజ్, రాంబాబు. కందుల సుబ్బారావు, రావుల రవి, సాంబయ్య, శ్రీను, రమేష్, జి నాగరాజు, జానయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

టేకులపల్లి: అధికారులు, సిబ్బంది అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు, సమాజంలో విలువ ఉంటుందని, మొక్కుబడిగా పనులు చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ నల్లమోతు రవి అన్నారు. ఈ మేరకు గురువారం టేకులపల్లి మండలం ఉపాధి హామీ పథకం 14వ ప్రజావేదిక (ఓపెన్ ఫోరం) సభ ఈజీఎస్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనుల సామాజిక తనిఖీలు, గ్రామసభ నిర్వహించారు. తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన పనుల వివరాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీపీ భూక్యా రాధ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి వై.రమణారావు, ఏఎంవీ కె.అనూష; అంబుడ్స్‌మెన్ నాగ ప్రకాశ్, సినియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి పాల్వంచ వెంకటేశ్వరరావు, ఎస్‌ఆర్‌పీ సురేష్, ఎంపీడీఓలు కోట వీరబాబు, దుద్దుకూరి బాలరాజు, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఈసీ ఎం.తిరుపతయ్య పాల్గొన్నారు.

ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం


ఓబన్నకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంరూరల్/సూపర్‌బజార్(కొత్తగూడెం): వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ డాక్టర్ రాంబాబు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఓబన్న 27 జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో ఓబన్న నిర్వహించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడైన ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. ఓబన్న జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో మెరుగైన సమాజం కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెనకబడిన తరగతుల అధికారి ఇందిర, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు, యువజన జిల్లా అధ్యక్షులు బొడాసు కనకరాజు, రాష్ట్ర కార్యదర్శి దుర్గారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండికోట దేవేందర్, గుర్రం శ్రీనివాస్, పనుగొండ సాంబశివరావు, డైరెక్టర్ కుంచపు కాశి, కుమారస్వామి, వల్లెపు సాయి రాం, ముద్దంగుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంక్రాంతి కాంతులు వెల్లివిరియాలి


కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో పొంగల్ వేడుకలు

పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతో అలరించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పండుగ ఆవశ్యకతను వివరించి, ప్రతీఒక్కరి జీవితంలో సంక్రాంతి కాంతులు వెల్లివిరియాలని చిన్నారులను ఆశీర్వదించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: కాకతీయ స్కూల్‌లో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, చైర్మన్ దీవీ


పాల్వంచ: డీఏవీ పాఠశాలలో...,


పాల్వంచరూరల్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


సుజాతనగర్ హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు


జూలూరుపాడు: హైస్కూల్‌లో ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులు


కొత్తగూడెంఅర్బన్: రామవరం ప్రభుత్వ పాఠశాలలో


టేకులపల్లి: బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో...